

అందని బోనస్..
జిల్లాలో సన్న ధాన్యం పండించిన రైతులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ పలువురి ఖాతాల్లో జమ కాలేదు. 8లో



క్రీడాకారుల నిరీక్షణ
ఏజెన్సీ యువత క్రీడల్లో రాణించేలా సాధన చేసేందుకు దుమ్ముగూడెంలో నిర్మిస్తున్న క్రీడా మైదాన పనులు మధ్యలోనే ఆగాయి. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగానే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితరపూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజ లు చేశారు.

నేడు డిప్యూటీ సీఎం, మంత్రి పొన్నం పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/మధిర/ఖమ్మం వ్యవసాయం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి సామగ్రితో సహా సిబ్బంది చేరుకునేలా సమకూర్చిన విద్యుత్ అంబులెన్స్‌లను ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరిస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం 12–30గంటలకు బోనకల్ మండలం జానకీపురం సబ్‌స్టేషన్‌లో రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం, ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లను ఆవిష్కరిస్తారు. ఇక రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉదయం 10–30 గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులతో పలు పథకాలపై సమీక్షిస్తారు. ఆ తర్వాత మధిరలో నిర్మించే నూతన బస్టాండ్ పనులకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం శంకుస్థాపన చేయనున్నారు.

ప్రారంభమైన టీజీ ఈసెట్ కౌన్సెలింగ్

ఖమ్మంసహకారనగర్: పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేలా నిర్వహించిన తెలంగాణ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు ఇటీవల వెల్లడయ్యాయి. ఈమేరకు అర్హత సాధించిన విద్యార్థులకు ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో మంగళవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. తొలిరోజు 105 మంది స్లాట్ బుక్ చేసుకోగా, 102 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. కౌన్సెలింగ్ 19వ తేదీ వరకు కొనసాగుతుందని వెల్లడించారు.

విద్యుత్ ధగధగలు..

మణుగూరు మండలం చిక్కుడుగుంటలో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్) విద్యుత్ వెలుగులతో జిగేల్‌మంటోంది. ఇందులో 270 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లను ఏర్పాటుచేయగా.. మొత్తం 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. దేశ, రాష్ట్ర అవసరాల్లో కీలక భూమిక పోషిస్తోంది. ప్లాంట్ లోపల భాగమంతా ఆహ్లాదకర వాతావరణం ఉట్టి పడేలా ఏర్పాట్లు చేశారు. ఇటీవల ఇక్కడ గెస్ట్‌హౌస్ నిర్మించగా.. దాంతోపాటు బీటీపీఎస్ ఆవరణ మొత్తం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. కాలుష్య నివారణకు మొక్కలు పెంచడంతో పాటు పచ్చిక మైదానాల కోసం గడ్డి మొక్కలు నాటి డ్రిప్ ద్వారా నీటి వసతి కల్పించారు. దీంతో రాత్రివేళ ఇటుగా వెళ్తున్న వారు ఆగి మరీ సెల్ఫీలు తీసుకుంటూ ఉత్సాహంగా కాసేపు గడుపుతున్నారు. బీటీపీఎస్ అందాలను వీక్షించేందుకు మణుగూరు చుట్టుపక్కల ప్రాంతాల వారు సైతం వస్తున్నారు.
– మణుగూరు రూరల్

వెలుగులు పంచుతున్న బీటీపీఎస్





విద్యుత్ కాంతులతో సుందరంగా దర్శనమిస్తున్న ప్లాంట్ ఆవరణ (ఇన్‌సెట్) విద్యుత్ వెలుగుల్లో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్

పల్లె చూపు.. పోరు వైపు



బ్యాలెట్ బాక్సులకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

ప్రాదేశిక సమరానికి సమాయత్తం
- వచ్చే నెలలో 'స్థానిక' ఎన్నికలకు అవకాశం
- గ్రామాల్లో మొదలైన సందడి

చుంచుపల్లి: వచ్చే నెలలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి వర్గ సహచరులకు సూచించడంతో అందరి దృష్టి ఎన్నికల వైపు మళ్లింది. తొలుత జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, ఆ తరువాత గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో అధికారులు సిద్ధమవుతున్నారు. ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వసతుల కల్పన, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, బ్యాలెట్ బాక్స్‌ల మరమ్మతుల పనులు పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది కేటాయింపు పూర్తి చేసి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రెయినీలు.. జిల్లాలో విధులు నిర్వహించే ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ పూర్తి చేశారు. అయితే ఈ ఎన్నికల్లో పాత రిజర్వేషన్లే కొనసాగిస్తారా.. కొత్తవి ప్రకటిస్తారా అనే విషయమై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

భద్రాచలం, సారపాకకూ ఎన్నికలు..
భద్రాచలం, సారపాకను కలిపి మున్సిపాలిటీగా మార్చాలనే యోచనతో 2018లో ఆయా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అయితే గిరిజన సంఘాల వారు కోర్టును ఆశ్రయించగా ఆ ప్రతిపాదన విరమించుకున్న ప్రభుత్వం.. ఆ తర్వాత ఒక్కో పంచాయతీని మూడుగా విభజించాలని బీఆర్ఎస్ హయాంలో చట్టం చేశారు. దాన్ని సైతం పలువురు వ్యతిరేకించగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పంచాయతీల్లో ఎలాంటి మార్పులు లేకుండా ప్రస్తుతం యథావిధిగా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇంకా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆమోదానికి పంపిన మరో 10 కొత్త పంచాయతీలపై స్పష్టత రావాల్సి ఉంది. అటు కార్పొరేషన్‌లోకి వెళ్లిన సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల పరిధిలో మూడు ఎంపీటీసీ స్థానాలు తగ్గే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఇటు ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో పాటు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు వరసగా ఎన్నికలు రానుండగా గ్రామాల్లో ఎన్నికల వేడి రాజుకుంటోంది.



22 మండలాల పరిధిలో..
జిల్లాలో 22 గ్రామీణ మండలాలు ఉండగా, వీటి పరిధిలో ప్రస్తుతం 471 గ్రామపంచాయతీలు, 4,168 వార్డులు, 22 జెడ్పీటీసీ, 236 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలకు మూడు విడుతలుగా ఎన్నికల నిర్వహిస్తారని తెలుస్తోంది. మొదట విడతలో 8 మండలాలు, రెండు, మూడు విడతల్లో ఏడు మండలాల చొప్పున ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయింది. సర్పంచ్‌లకు గులాబీ, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు పార్టీ గుర్తులు ఉండనందున.. సర్పంచ్ అభ్యర్థులకు 20, వార్డు సభ్యులకు 10 చొప్పున స్వతంత్ర గుర్తులను కేటాయించారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం



జిల్లాలో స్థానిక సంస్థలతో పాటు పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది కేటాయింపు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, బ్యాలెట్ బాక్స్‌లు ఇప్పటికే రెడీ చేశాం. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి తొలి విడత శిక్షణ ఫిబ్రవరిలోనే పూర్తిచేశాం.
– ఎం.విద్యాచందన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

జిల్లాలోని స్థానిక సంస్థల వివరాలు..

జెడ్పీటీసీ స్థానాలు : 22	గ్రామపంచాయతీలు : 471
ఎంపీటీసీ స్థానాలు : 236	వార్డుల సంఖ్య : 4,168
పోలింగ్ కేంద్రాలు : 1,279	పోలింగ్ కేంద్రాలు : 4,200

గనుల్లో రక్షణ చర్యలపై ఆరా..

కొత్తగూడెం ఏరియాలో పర్యటించిన డీజీఎంఎస్ బృందం



డీజీఎంఎస్ బృందంతో సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి బొగ్గు గనుల్లో ఎలాంటి రక్షణ చర్యలు పాటిస్తున్నారని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీజీఎంఎస్) అధికారులు ఆరా తీశారు. గనుల్లో రక్షణ, భద్రతా చర్యలపై గురువారం కొత్తగూడెం ఏరియాలో నిర్వహించనున్న ఇంటరాక్టివ్ సెక్షన్‌లో పాల్గొనేందుకు వారు మంగళవారమే చేరుకున్నారు. స్థానిక ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారా యణరావు వారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీజీఎంఎస్ బృందానికి నేతృత్వం వహించిన టి.ఆర్.కన్నన్ మాట్లాడుతూ.. గనుల్లో ఇటీవల ఏమైనా ప్రమాదాలు జరిగాయా.. నివారణకు కంపెనీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడిగితెలుసుకున్నారు. ఆ తర్వాత ఏరి యాలోని పలు గనులు, డిపార్ట్‌మెంట్లలో పర్యటించి రక్షణ చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ అశోక్‌కుమార్, ఎస్ఓటు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సనత్‌కుమార్, ఇతర డైరెక్టర్లు దిలీప్ కుమార్, కమలేష్, కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల జీఎంలు శాలేంరాజు, వి.కృష్ణయ్య, సేఫ్టీ జీఎం శ్రీనివాస్‌రావుతో పాటు వివిధ విభాగాల అధికారులు కె.జి.తివారీ, దామోదర్‌రావు, కోటిరెడ్డి, వెంకటేశ్వరరావు, జి.వి.మోహన్‌రావు, గోవర్ధన్, హరీష్, సయ్యద్ ఖలీల్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌ఈడీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్ : భద్రాచలంలోని డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎల్‌ఈడీ) కళాశాలలో 2025 – 27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 50 సీట్లు ఉన్నాయని, దరఖాస్తు చేసుకునే వారు ఏజెన్సీ ప్రాంతవాసులై, ఇంటర్‌లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఈనెల 16 నుంచి జూలై 10 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులను ఉపాధ్యాయులుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన ఏకైక ప్రత్యేక కళాశాల ఇదని తెలిపారు. ఎలాంటి ప్రవేశ పరీక్షలు లేకుండా మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వివరించారు. దరఖాస్తు చేసే విద్యార్థులు చర్ల రోడ్డులో ఉన్న డీఎల్‌ఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులు భద్రాచలంతో పాటు ఉట్నూరు, ఏటూరునాగారం ఐటీడీఏల్లోనూ లభిస్తాయని, వివరాలకు 99595 75539, 99494 93416 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మాతా శిశు ఆరోగ్యంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్ : జిల్లాలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలు పక్కగా అమలు చేయాలని, మాతా శిశు ఆరోగ్యాలపై దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని, వీటిని వైద్యాధికారులు పర్యవేక్షించాలని అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎస్. జయలక్ష్మి మాట్లాడుతూ పోషకాహార కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ మధువరణ్, డాక్టర్ తేజశ్రీ, ప్రోగ్రామ్ అధికారులు పి.స్పందన, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గోదావరి నదికి వరదలొస్తే అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఐడీఓసీలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అధికారుల వాహనాల్లో లైఫ్ జాకెట్లు, టార్చిలైట్, తాడు, హ్యాండ్ మైక్ సిద్ధంగా ఉండాలన్నారు. ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందస్తు ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల వారిని తరలించేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లైఫ్ జాకెట్లు, గజఈతగాళ్లు, నాటు పడవలు, బోట్లు సిద్ధంగా ఉంచాలని అన్నారు. రానున్న మూడు నెలల పాటు నిత్యావసర వస్తువులు నిల్వ ఉంచాలని డీఎస్‌ఓను ఆదేశించారు. వరద ముంపు చర్యల పర్యవేక్షణకు సెక్టోరియల్, జోనల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. అత్యవసరమైతే హెలీకాప్టర్ సేవలు ఉపయోగించుకునేలా హెలీప్యాడ్లు ఏర్పాటు చేయాలని, కిన్నెరసాని వంటి ప్రాజెక్టుల గేట్లు ఎత్తే సమయంలో ప్రభావిత ప్రాంతాల వారికి ముందుగానే సమాచారం అందించాలని అన్నారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసేలా ఫ్లడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని చెప్పారు. గర్భిణులు ఇబ్బంది పడకుండా ముందుగానే ఆస్పత్రుల్లో చేర్పించాలని, 108 వాహనాలు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. పాము, తేలు కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు సిద్ధంగా ఉంచాలన్నారు. సింగరేణి, కేటీపీఎస్, నవభారత్ తదితర సంస్థల రెస్క్యూ టీమ్‌ల సేవలు వినియోగించుకునేలా జాబితా సిద్ధం చేయాలని సూచించారు. భద్రాచలంలోని విస్తా కాంప్లెక్స్, అశోక్‌నగర్‌లో నీరు నిల్వకుండా ఎత్తిపోసేందుకు మోటార్లను అందుబాటులో ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గోదావరి వరద 73 అడుగుల మేర వచ్చినా ఎదుర్కొనేలా అధికారులు ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ గిరిజనులు పలు కీలక సేవలు పొందేందుకు 15 రోజుల పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, ఏఎస్పీ విక్రాంత్‌సింగ్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో 1,13,398 మందికి రైతు భరోసా
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా సోమ, మంగళవారాల్లో కలిపి 1,13,398 మంది రైతుల ఖాతాల్లో రూ.102,10,83,683 జమయ్యాయని కలెక్టర్ పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. గత యాసంగిలో పట్టాదారులు 1,78,545 మంది ఉండగా ప్రస్తుతం కొత్తగా 1,023 మంది పట్టాలు పొందారని, అలాగే గత సీజన్‌లో బ్యాంకు వివరాలు సరిగా లేనివారు, నమోదు చేయని వారు కలిపి 1,382 మంది ఉన్నారని పేర్కొన్నారు. వానాకాలానికి సంబంధించి 1,79,535 మంది లబ్ధిదారుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేశామని తెలిపారు. నూతనంగా పట్టాలు పొందిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌ను ఏఈఓలకు అందించి రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఒలింపిక్ డే రన్ టీషర్టుల ఆవిష్కరణ
ఈనెల 23న అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన టీ షర్టులను కలెక్టర్ పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో దేశం తరఫున పాల్గొని పతకాలు సాధించడమే లక్ష్యంగా క్రీడాకారులు ముందుకు సాగాలన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ ఎస్‌కె సాబీర్‌పాషా మాట్లాడుతూ ఈ రన్‌ను పాల్వంచలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం ప్రారంభిస్తారని తెలిపారు. 19న అశ్వారావుపేట, 20న భద్రాచలం, 21న మణుగూరు, 22న ఇల్లెందులో కొనసాగుతూ 23న కొత్తగూడెంలో ముగుస్తుందని వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ ఎం. పరంధామరెడ్డి, అసోసియేషన్ బాధ్యులు వై.వెంకటేశ్వర్లు, కె.మహీధర్, మాస్టర్స్ అథ్లెటిక్స్ ప్రెసిడెంట్ మంజులాల్, కార్యదర్శి నాగలక్ష్మి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్, అంతర్జాతీయ క్రీడాకారిణి సింధు తపస్వి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ వసతులు
పాల్వంచ: అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నామని కలెక్టర్ పాటిల్ తెలిపారు. పాత పాల్వంచ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో విద్యార్థులకు ఆయన పలకలు, పుస్తకాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుద్దీకరణ, తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని, అనుభవజ్ఞులైన టీచర్లను నియమించామని చెప్పారు. చిన్నారులను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి ఆర్థిక భారం పెంచుకోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిణి స్వర్ణలత లెనినా, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పత్తి రైతుపై విత్తన భారం

- అందని ప్రభుత్వ సబ్సిడీ
- అయినా సాగుకు రైతుల మొగ్గు
- జిల్లాలో ఈ ఏడాది రెండు లక్షల ఎకరాలు దాటే అవకాశం



దుక్కి దున్నతున్న రైతులు

పాల్వంచరూరల్ : ప్రతీ సంవత్సరం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నాయి. ఆరుగాలం శ్రమించినా పంటలకు సరైన ధర రాక నష్టపోతున్నారు. కొన్ని రకాల విత్తనాలకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందుతున్నా.. పత్తి, వరికి మాత్రం ఎలాంటి రాయితీలు రావడం లేదు. ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సి రావడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. దీనికి తోడు గతేడాది 450 గ్రాముల పత్తి ప్యాకెట్ ధర రూ. 856 ఉండగా, ఈ సంవత్సరం రూ.45 పెరిగి రూ.901కి చేరింది.

ఈ ఏడాది పెరగనున్న సాగు..
జిల్లాలో గత సంవత్సరం 1.85 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. ఈసారి రెండు లక్షల ఎకరాలకు పైగా సాగయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎకరానికి రెండు నుంచి మూడు ప్యాకెట్ల విత్తనాలు అవసరమవుతాయి. కాగా, కొందరు డీలర్లు నాణ్యమైన విత్తనాలు, అధిక దిగుబడి వస్తాయి అని చెబుతూ అమాయక రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లతో పాటు దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్లు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది మిర్చి పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో ఈ ఏడాది ఎక్కువ మంది పత్తి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు.

అదును లేకున్నా విత్తనాలు..
జిల్లాలో ప్రస్తుతం ఆశించిన మేర వర్షాలు కురవలేదు. అయితే విత్తనాల సాగుకు అదును లేకున్నా కొందరు రైతులు పత్తి విత్తనాలు వేస్తున్నారు. పొడి దుక్కుల్లో విత్తొద్దని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా పలువురు పెడచెవిన పెడుతున్నారు. మృగశిర కార్తె ప్రారంభమైతే వర్షాలు కురుస్తాయని, ముందుగానే దిగుబడి వస్తే అధిక ధర దక్కుతుందనే ఆశతో విత్తనాలు వేసిన రైతులు.. ఇప్పటికీ ఎండలు దంచికొడుతుండడంతో మొలకలు రాక, వచ్చినవీ ఎండిపోతుండడంతో తలపట్టుకుంటున్నారు. మరోసారి విత్తనాలు కొనుగోలు చేయాలంటే ఆర్థిక భారం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

ఏటా ధరలు పెంచుతున్నారు



ప్రతీ సంవత్సరం పత్తి విత్తనాల ధరలు పెంచడం మాకు భారంగా మారుతోంది. ఈ ఏడాది వానాకాలంలో మూడెకరాల్లో పత్తి సాగుచేస్తున్నా. అడపాదడపా కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని పత్తి విత్తనాలను వేశాను. రోహిణి కార్తెలో విత్తనాలు వేస్తే ముందస్తుగా పంట దిగుబడి వస్తుందనే ఆశతో వేశా. కానీ ఇప్పుడు ఎండలతో మొలకలు రాలేదు.
– సురేష్, రైతు, లక్ష్మీదేవిపల్లి

ప్రభుత్వం సబ్సిడీపై అందించాలి



ఏటేటా పత్తి విత్తనాల ధరలు పెంచి అదనపు భారం మోపుతున్నారు. పత్తి, వరి విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీపై అందించాలి. గతేడాది పత్తి సాగు చేసి ఆశించిన దిగుబడి రాక అప్పుల పాలయ్యాను. ఆ అప్పులు పూడ్చుకోవడానికి ఈ వానాకాలంలో నాలుగెకరాల్లో మళ్లీ సాగు చేస్తున్నా. ముందుగానే విత్తనాలు కూడా వేశాం.
– ఎస్.రామకృష్ణారెడ్డి, రైతు, ప్రభాత్‌నగర్

వర్షాలు కురిశాకే విత్తనాలు వేయాలి



వేసవి వేడి తగ్గక ముందే పొడి దుక్కులో విత్తనాలు వేయొద్దు. తొలకరి వానలు కురిసిన తర్వాత నేలలో తేమ శాతం ఉన్నప్పుడే వేయాలి. విత్తనాలు వేసే ముందు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడికి అవకాశం ఉంటుంది.
– బి.శంకర్, మండల వ్యవసాయశాఖాధికారి

క్లుప్తంగా

కుమార్తెను ప్రభుత్వ బడిలో చేర్పించిన ఉపాధ్యాయుడు



తన కుమార్తెను ప్రభుత్వ బడిలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రావు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఎంపీపీఎస్‌లో వర్గ మండలం పులిగుండాల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నూనె ప్రభాకర్‌రావు తన కుమార్తె నూనె శృతిని మంగళవారం జాయిన్ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య, ఇతర సదుపాయాలు మెరుగ్గా ఉన్నందున తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బొడ్డు నాగేశ్వరరావు, హైమావతి, ఐఆర్‌పీ రాగిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల నిర్వహణ, మార్కెటింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

చుంచుపల్లి: గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక బృందాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో తెలంగాణ పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్తంగా మహిళలకు పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువలపై మంగళవారం కొత్తగూడెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ.. ఈ అంశాలపై మరింత త్వరలో పరిపూర్ణ శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారికి బ్యాంకుల ద్వారా రుణ సహాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం అనురాధ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, అలీప్ కమిటీ సభ్యురాలు పద్మావతి, అన్నపూర్ణ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పట్టివేత

చండ్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న రూ.9 లక్షల విలువైన పత్తి, మిరప విత్తనాలు పట్టుకున్నట్లు ఏఓ వినయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. సుజాతనగర్‌కు చెందిన డీలర్ బెండాలపాడులో నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. లైసెన్స్ ఏప్రాంతంలో ఉంటే అక్కడే విత్తనాల విక్రయించాల్సి ఉంటుందని, రూ.8 లక్షల విలువ చేసే 10 కిలోల 250 గ్రాముల మిరప విత్తనాలు, రూ.90 వేల విలువ చేసే పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఏఓ ఫిర్యాదు మేరకు డీలర్‌పై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

అందని బోనస్..

- సన్న వడ్లు విక్రయించిన రైతుల ఎదురుచూపులు
- 36,950 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రూ.18.47 కోట్ల బకాయి



ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

బూర్గంపాడు: సన్నరకం ధాన్యం పండించిన రైతులకు ప్రోత్సాహకరంగా ప్రభుత్వం అందిస్తామన్న బోనస్ రైతుల ఖాతాల్లో జమకాలేదు. యాసంగిలో రైతులు ఎక్కువగా దొడ్డురకం వరిని సాగు చేస్తారు. ప్రభుత్వం రూ.500 బోనస్‌గా అందిస్తామని ప్రకటించడంతో ఈ యాసంగిలో జిల్లాలో రైతులు 65 శాతం విస్తీర్ణంలో సన్నరకం వరిని సాగు చేశారు. అయితే యాసంగిలో సన్నరకం ధాన్యం పండించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన రైతులకు ఇప్పటి వరకు బోనస్ అందలేదు. వానాకాలం సీజన్ ఆరంభమైనా బోనస్ అందకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ..

ఈ యాసంగిలో జిల్లాలో 55,243 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో 36,950 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. సన్నరకం ధాన్యానికి సంబంధించి రైతులకు రూ.18.47 కోట్లు బోనస్ కింద అందాల్సి ఉంది. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320 ప్రభుత్వ మద్దతు ధరచెల్లించి. దీంతో పాటు సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోంది. సన్నరకం వడ్లుపండించటంలో ఎన్నో వ్యయ ప్రయాసలున్నాయి. సన్నరకం వరికి తెగుళ్లు, దీడపురుగు, దోమపోటు ఎక్కువగా ఉంటాయి. దీంతో పెట్టుబడులు పెరుగుతాయి. ప్రభుత్వం బోనస్ అందిస్తుందనే ఆశతో రైతులు సన్నరకం వరిసాగుకు మొగ్గుచూపారు. యాసంగి ధాన్యం అమ్మి నెలన్నర రోజులు కావస్తున్నా బోనస్ డబ్బులు అందకపోవటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అసలు బోనస్ అందుతుందో లేదోననే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతోంది.

ఆలస్యమవుతున్న బోనస్..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు వారం రోజుల వ్యవధిలో ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం నగదు బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. అయితే ప్రభుత్వం అందించే బోనస్ మాత్రం ఒకింత ఆలస్యంగా జమవుతోంది. గత వానాకాలం సీజన్‌లో కూడా రైతులకు అందాల్సిన బోనస్ ఆలస్యమైంది. వానాకాలం సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం అమ్మిన రైతులకు కొంత ఆలస్యంగానైనా బోనస్‌మొత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమైంది. దీంతో రైతులు యాసంగిలో కూడా ఎక్కువ విస్తీర్ణంలో సన్నరకం వరిని సాగు చేశారు. ఇంచుమించు యాభై రోజులు దాటినా ఇప్పటి వరకు బోనస్ రాకపోవటంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వానాకాలం పెట్టుబడులకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

> **పది రోజుల్లో పడొచ్చు**
>
> జిల్లాలో సన్న ధాన్యం విక్రయించిన రైతుల వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందించాం. వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో బోనస్ నగదు జమయ్యే అవకాశం ఉంది.
>
> -రుక్మిణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

118 క్వింటాళ్లు విక్రయించా..



యాసంగిలో 118 క్వింటాళ్ల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. అందుకు గాను క్వింటాకు రూ.500 చొప్పున రూ.59 వేల బోనస్ రావాలి. వడ్లు అమ్మి నెలన్నర దాటింది. బోనస్ వస్తే మళ్లీ పెట్టుబడులకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం యాసంగి బోనస్‌ను వెంటనే విడుదల చేయాలి.

-వెలమ రమేశ్, రైతు, మల్లెలమడుగు, అశ్వాపురం మండలం

రూ.10 వేలు రావాలి



యాసంగిలో 20 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. అందుకు గాను నాకు రూ.10 వేలు రావాలి. బోనస్ వస్తుందని యాభై రోజులుగా ఎదురుచూస్తున్నా. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే బోనస్ చెల్లించాలి.

-మాదాసు గోవర్ధన్, రైతు, కారెగట్టు, పాల్వంచ మండలం

చైన్ స్నాచర్ల అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ సతీశ్‌కుమార్

పాల్వంచ: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి మెడలో నుంచి మరో బైక్‌పై వెళ్తున్న యువకుడు, ఇద్దరు మైనర్లు కలిసి బంగారు చైన్ చోరీ చేయగా.. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సతీశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న గొల్లగూడెం ఏరియా రేణుకా అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే పెనికలపాటి ఆజా హాంబీటర్ బైక్‌పై బజారుకు వచ్చి సరుకులు తీసుకుని వెళ్తుండగా జూలూరుపాడు మండలం బాలేనినిపేట పెద్దతండాకు చెందిన భూక్యా వినోద్, మరో ఇద్దరు మైనర్లు కలిసి స్పోర్ట్స్ బైక్‌పై వెంబడించారు. ఒడ్డుగూడెం రోడ్‌లో నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశంలో ఆజ్మాహాంబీటర్ మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. దీంతో ఆజ్మాహాంబీటర్ బైక్ పైనుంచి కింద పడగా, ముగ్గురు పరారయ్యారు. దీంతో సీఐ సతీశ్, ఎస్ఐలు సుమన్, జీవన్‌రాజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సీసీఎస్ పోలీసులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టి చోరీ చేసిన ముగ్గురిని పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.లక్ష విలువ చేసే 23.6 గ్రాముల బంగారు చైన్, మూడు సెల్‌ఫోన్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వినోద్ గతంలో కొత్తగూడెం త్రీటౌన్, టూటౌన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లు, జూలూరుపాడు పరిధిలో మిరప బస్తాలు చోరీ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. సమావేశంలో ఎస్ఐలు కల్యాణి, దేవీసింగ్ పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

సుజాతనగర్: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని మహిళపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రమాదేవి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. హాలియాతండాకు చెందిన మాలోత్ అరుణపై అదే గ్రామానికి చెందిన మాలోత్ విజయ్‌కుమార్, మాలోత్ గోపి, మాలోత్ సంతోష్ ఈ నెల 15న మద్యం సీసాలతో దాడికిపాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేసినిరిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. కాగా, మాలోత్ విజయ్‌కుమార్ గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నందున సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు

భద్రాచలంటౌన్: గురుకులం, ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన వసతి, అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో పీవో పాల్గొన్నారు. ప్రతి పాఠశాలల్లో అడ్మిషన్లు పూర్తి కావాలని, పిల్లలు ఎవరూ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా సంబంధిత హెచ్ఎంలు, వార్డెన్లు బాధ్యత తీసుకోవాలని, కాస్మొటిక్ వస్తువులు, వంట సామగ్రి సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక రిజిస్టర్ ఉండాలని, అన్ని వివరాలు పొందుపరచాలని, ఏఎన్ఎంలు, పర్యవేక్షణలో ఉంటూ సేవలు అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆటో కారు ఢీ

పాల్వంచరూరల్: ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ తీవ్రగాయాలయ్యాయి. ఘటన జగన్నాథపురం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. జగన్నాథపురం శివారు బీసీఎం జాతీయ రహదారిపై మంగళవారం పాల్వంచ నుంచి సారపాకకు వెళ్తున్న ఆటో, భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ పరమేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని కొత్తగూడెం తరలించారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

యాంటీ డ్రగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశాన్ని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి, మత్తు పదార్థాల వినియోగించకుండా కళాశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర సరిహద్దుల, చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా పెట్టాలని సూచించారు. ఆటవీ శాఖాధికారులు గంజాయి సాగు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలను ప్రతినెలా తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

టీడీ యాక్టు నమోదు చేస్తాం

మాదకద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసినా పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ రోహిత్‌రాజ్ హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 3,500 కేజీల గంజాయి సీజ్ చేశామని తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా మాదకద్రవ్యాలను గుర్తించేందుకు రెండు నార్కొటిక్ డాగ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని, భద్రాచలంలో డీఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. సమీక్షలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, కొత్తగూడెం ఆర్‌డీఓ వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, డీపీఓ బాబూరావు పాల్గొన్నారు. అలాగే, రహదారి భద్రతపై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించగా.. కలెక్టర్, ఎస్పీ పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువెక్కువ జరుగుతున్నాయో గుర్తించాలని, ఈనెల చివరి నాటికి రహదారులపై ఉన్న గుంతలను పూడ్చాలని చెప్పారు. ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా ఆస్పత్రులకు తీసుకువెళ్లేందుకు అవకాశం ఉన్న సమీప రహదారులు, ఆస్పత్రులను ఎంపిక చేయాలని చెప్పారు. రహదారులపై సైన్‌బోర్డులతో పాటు, రేడియం స్టిక్కర్లు, జీబ్రాలైన్లు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం రహదారి భద్రతపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీటీఓ చంద్రమౌళి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ఆఫ్‌టైప్'కు పరిహారం చెల్లించకపోతే ఆందోళనలు

రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తీగల సాగర్



ఆయిల్‌పామ్ తోటలో పరిశీలిస్తున్న రాష్ట్ర రైతు సంఘం నాయకులు

సత్తుపల్లి/వేంసూరు: ఆయిల్‌పామ్ సాగుచేయగా, ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చిన రైతులకు పరిహారం చెల్లించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ హెచ్చరించారు. సత్తుపల్లి, వేంసూరు దమ్మపేట మండలాల్లోని ఆయిల్‌పామ్ తోటలు, రేగళ్లపాడులోని నర్సరీని మంగళవారం సంఘం ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తోటలోనే 40 ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చాయని చెప్పారని, తర్వాత ఇంకా ఎందరు రైతులకు ఇలా జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. నాలుగేళ్లుగా ఆఫ్‌టైప్ మొక్కలు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఒక్కో రైతు ఎకరాకు రూ.6 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు. రేగళ్లపాడు నర్సరీలో 2.20 లక్షల మొక్కలను తీసివేయకుండా రైతులకు ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నించడం సరికాదన్నారు. ఇకనైనా ఆయిల్‌ఫెడ్ ఆక్షణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించడమే కాక పామాయిల్ మొక్కలు ధరను టన్నుకు రూ.25వేలు ఇవ్వాలని సాగర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బొంతు రాంబాబు, కొప్పురావూరి పుల్లయ్య, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, చెలికాని సూరిబాబు, అన్నవరపు సత్యనారాయణ, బాల బుచ్చయ్య, వెంకట్రావ్, మోరంపూడి పాండు, సర్వేశ్వరరావు, రావుల రాజబాబు పాల్గొన్నారు.

రూ. 200 కోట్లతో మార్కెట్ల అభివృద్ధి

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ఈ ఆర్థిక సంవత్సరం రూ. 200 కోట్లు కేటాయించామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తెలిపారు. ఖమ్మంలో వ్యవసాయ మార్కెట్‌లో మోడల్ మిర్చి మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.155 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. ఖమ్మంలో మోడల్ మిర్చి మార్కెట్ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించిన ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి మాట్లాడుతూ మిర్చి మోడల్ మార్కెట్‌ను వచ్చే సీజన్‌లు పూర్తి చేస్తామని తెలిపారు. గడిచిన ఏడాది రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ ఆదాయ లక్ష్యం రూ.800 కోట్లు కాగా రూ.782 కోట్లు సాధించామని, ఈ ఏడాది మరింత పెంచేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కాగా, సీసీఐ పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతుందని, నివేదిక ఆధారంగా ఇంకొందరు ఉద్యోగులపై చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం డైరెక్టర్ ఖమ్మం వీడీఓస్ కాలనీ, ఎన్ఎస్‌పీ క్యాంపు, పెవిలియన్ గ్రౌండ్ సమీపాన సమీకృత మార్కెట్లను పరిశీలించారు. వీడీవోస్ కాలనీ సమీకృత రైతు మార్కెట్‌లో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ మార్కెట్ పనులపై ఆరా తీశారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న కూరగాయలు, ఆకుకూరల విక్రయాలను పరిశీలించిన ఆమె ఆకుకూరలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారి ఉప్పల శ్రీనివాస్, ఎంవీ మధుసూదన్, పద్మావతి, లక్ష్మీగౌడ్, ఉప్పల శ్రీను, అలీం, యరగర్ల హన్మంతరావు, తల్లాడ రమేశ్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారుల నిరీక్షణ

- దుమ్ముగూడెంలో నత్తనడకన క్రీడా మైదాన నిర్మాణ పనులు
- ఇండోర్ స్టేడియానికి విద్యుత్ సౌకర్యం లేదు..
- అసంపూర్తిగా వదిలేసిన ట్రాక్ నిర్మాణం
- పట్టింపులేని ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు



ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిమ్ సామగ్రి



మైదానంలోని వాకింగ్ ట్రాక్‌పై పెరిగిన పిచ్చి మొక్కలు

దుమ్ముగూడెం: ఏజెన్సీ యువతలోని క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు, వారు సాధన చేసేందుకు క్రీడా మైదానం ఏర్పాటుకు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన ఉన్న ప్రభుత్వ భూమి 8 ఎకరాల 27 గుంటలను కేటాయించింది. ప్రభుత్వం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నక్సల్స్ ప్రభావిత అభివృద్ధి నిధుల రూ.2.27 కోట్లను క్రీడా మైదానం నిర్మాణానికి మంజూరు చేసింది. 2023లో పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ ఏడాది వరకు ఇండోర్ నిర్మాణం పూర్తి చేశారు. కానీ విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. ట్రాక్ నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో ఈ ఏడాది కూడా నిరీక్షణ తప్పేలా లేదు.

క్రీడాకారులకు మేలు..

మండలంలో క్రీడామైదానం నిర్మాణం పూర్తయితే గ్రామీణ క్రీడాకారులకు మేలు జరుగనుంది. జిల్లా స్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించుకోవచ్చని జిల్లా అధికారులు తెలిపారు. మండలంలో ఎందరో యువతీ, యువకులు పలు క్రీడల్లో రాణిస్తున్నారు. వారు సాధన చేసేందుకు అనువైన క్రీడామైదానం లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మైదాన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ ఆడే వారు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మైదానం లేక జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో సాధన చేస్తున్నారు.

జిమ్ మెటీరియల్ ఏర్పాటు..

ఇండోర్ నిర్మాణం పూర్తి కావడంతో ఈమధ్య మండల పర్యటనకు వచ్చిన ఎస్పీ రోహిత్‌రాజ్ ఇండోర్‌ను, ట్రాక్‌ను పరిశీలించారు. ఈ సమయంలో యువత జిమ్ మెటీరియల్ కావాలని ఆయన దృష్టికి తీసుకురావడంతో ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకుని ఇండోర్‌లోకి కావాల్సిన షటిల్ మ్యాట్, జిమ్ మెటీరియల్, టేబుల్ టెన్నిస్ బోర్డు, క్యారమ్ బోర్డులు, వాలీబాల్, షటిల్ బ్యాట్‌లను ఏర్పాటు చేసి నెల రోజులు కావొస్తున్నా నేటికీ ప్రారంభం కాలేదు. నిత్యం షటిల్ ఆడేవారు ఇండోర్ స్టేడియం ప్రారంభం కాకపోవడంతో బయట నెట్ పెట్టి కింద కోర్టు వేసుకుని ఆడుతున్నారు.

> **రెండేళ్ల కిందట పనులు షురూ..**
>
> 
>
> మండలంలోని క్రీడాకారుల సౌకర్యార్థం పోలీస్, ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం, ట్రాక్ నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియడం లేదు. పనులు చేపట్టి దాదాపు రెండేళ్లవుతోంది. అధికారులు దృష్టి పెట్టి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు కూడా నాసిరకంగా చేపట్టారు.
>
> -తెల్లం హరికృష్ణ, సీనియర్ క్రీడాకారుడు

> **యువత ఎదురుచూస్తున్నారు..**
>
> 
>
> మండలంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయితే దాంట్లో ప్రాక్టీస్ చేసుకోవచ్చని, జిమ్‌కు వెళ్లొచ్చని యువత ఎదురుచూస్తోంది. అలాగే ట్రాక్ పూర్తయితే ఎందరో వాకింగ్ చేసేందుకు ఉపయోగపడుతుంది. మండలంలో ఎందరో క్రీడాకారులు ఉన్నారు. వారందరికీ మైదానం ఉండటంతో సాధన చేసుకోవచ్చు. అధికారులు చొరవ తీసుకుని త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.
>
> -యలమంచి వంశీకృష్ణ, సీపీఎం నాయకుడు

విష కీటకం కుట్టి బాలుడి మృతి



అఖిల్ తేజ (ఫైల్)

మణుగూరుటౌన్: ఓ విషకీటకం కుట్టి బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని గుట్టమల్లారంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రోజు లాగే తల్లిదండ్రులు, అన్నతో కలిసి నిద్రపోయిన అఖిల్‌తేజ (10).. మంగళవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో లేచాడు. బహిర్భూమికి వెళ్లలని, విషకీటకం కుట్టిందని, కడుపులోనొప్పిగా ఉందని రోదిస్తూ కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వెంటనే స్థానిక 100 పడకల ఆస్పత్రికి తరలించారు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన అఖిల్‌తేజను భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. వారు వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. బాలుడి మృతితో గుట్టమల్లారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పెద్దమ్మతల్లి ఆలయ ప్రధాన అర్చకుడు మృతి





అమ్మవారి పూజలో పురుషోత్తమశాస్త్రి (ఫైల్)

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ ప్రధాన అర్చకుడు పురాణం పురుషోత్తమశాస్త్రి (66) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతిచెందారు. గొల్లగూడెంలో నివాసం ఉంటున్న అర్చకులు ఆలయంలో 1974 నుంచి సేవలు అందిస్తున్నారు. నాలుగేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేసినప్పటికీ సేవలు అందిస్తున్నారు. సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా అమ్మవారి సన్నిధి వరకు రాగానే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమార్తెలు శైలజ, ప్రవంతి ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



బానోత్ లోకేశ్ (ఫైల్)

టేకులపల్లి: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దాసుతండా పంచాయతీ రేగులతండాకు చెందిన బానోత్ కిషన్, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు బానోత్ లోకేశ్ (22) ఉన్నారు. రెండో కుమార్తె పెళ్లి చేసి హైదరాబాద్‌లో ఉంటోంది. పెద్ద కుమార్తెకు పెళ్లికాగా, రెండో కుమార్తె హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటోంది. లోకేశ్ ఇంటర్ వరకు చదివి హైదరాబాద్‌లో అక్కతో ఉంటూ ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తున్నాడు. తండ్రికి ఆరోగ్యం బాగాలేకపోతే చూడ్డానికి ఇంటికి వచ్చాడు. ఐదిలాఉండగా రెండు రోజుల కిందట తల్లిదండ్రులు గొర్రెకు పెట్టి మంగళవారం ఇంటికి వచ్చి చూడగా.. లోకేశ్ ఉరివేసుకుని, మృతిచెంది ఉన్నాడు. ఎస్ఐ రాజేందర్ ఘటనా స్థలానికి చేసు కుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.